క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది నాలుగో తరగతి పూర్తయిన విద్యార్థులు 5వ తరగతికి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీలో చేరేందుకు మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 6వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలలో ఉచితంగానే ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9010159448, 9849695785ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బాలోత్సవ్‌లో కేజీబీవీ బాలికల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన బాలికలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: ఒంగోలులో ఇటీవల నిర్వహించిన ప్రకాశం బాలోత్సవ్‌లో గొట్లగట్టు కేజీబీవీ బాలికలు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన బాలికలను ప్రత్యేకంగా అభినందించారు. సీనియర్, జూనియర్ విభాగంలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న సీహెచ్ హెప్సిబా, వీవీ నాగలక్ష్మి మొదటి బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి



సీడీపీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

మార్కాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీఓకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వేతనాల పెంపుదలకు నిధులు ఇవ్వాలని కోరారు. గతంలో అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం వారికి సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, గ్రాట్యుటీ ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ మహిళా సభ్యులు ప్రభావతి, ఆశాబీ, రమా, నారాయణమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మీటర్ రీడర్స్ సభ్యులు

మార్కాపురం: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 20న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మీటర్ రీడర్స్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు షేక్ ఖాశీం, మీటర్ రీడర్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ మంగళవారం కోరారు. వాల్‌పోస్టర్‌ను సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. మీటర్ రీడర్స్ కష్టాలను తొలగించాలని, సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, కనీస వేతనం అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. మహాసభకు మీటర్ రీడర్స్ అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, ఉమర్, కాశయ్య, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఊహించని రీతిలో సంభవించే అగ్ని ప్రమాదాలు ఆస్తులనే కాదు వాటి యజమానుల ఆశలనూ బుగ్గి చేస్తున్నాయి. అజాగ్రత్త, ఏమరపాటుతోనే కాకుండా కొందరు ఆకతాయిల చేష్టలతోనూ తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు కూడా అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లోనూ మంటలు చెలరేగి వాహనాలతో పాటు వాటిలో ప్రయాణిస్తున్న వారు సజీవ దహనమైన సంఘటనలూ గిద్దలూరు నియోజకవర్గంలో చోటుచేసుకున్నాయి. గడిచిన ఏడాది వ్యవధిలో నియోజకవర్గంలో 200 వరకు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోగా కోట్ల రూపాయల్లో ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలాలకు చేరుకునేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ సేవలను మరింత విస్తృతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- గిద్దలూరు నియోజకవర్గంలో తరచూ అగ్ని ప్రమాదాలు
- దూరప్రాంతాలకు అగ్నిమాపక సిబ్బంది వెళ్లేలోగా ఆస్తి నష్టం
- గడిచిన ఏడాది వ్యవధిలో 200 ప్రమాదాలు
- వేసవి కాలం సమీపిస్తుండటంతో ప్రజల్లో మొదలైన ఆందోళన
- కంభం అగ్నిమాపక కేంద్రంలో 22 ఏళ్లనాటి డొక్కు వాహనం
- తరచూ మొరాయిస్తుండటంతో తంటాలు

ఆస్తులూ.. ఆశలూ.. బుగ్గి!



అర్ధవీడు మండలం పాపినేనిపల్లెలో ఇటీవల కాలిపోయిన ఇల్లు

నూతన వాహనం కోరాం



కార్యాలయంలో ఉన్న వాహనం సుమారు 22 సంవత్సరాల క్రితం నాటిది. మరమ్మతులకు గురైతే వెంటనే చేయించి సిద్ధంగా ఉంచుతున్నాం. నూతన వాహనం మంజూరు చేయాలని అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపాం. ప్రస్తుతానికి కార్యాలయంలో నీటి సమస్య లేదు. ప్రహరీ లేకపోవడంతో పశువులు కార్యాలయంలోకి ప్రవేశిస్తున్నాయి.

– డీపీ చౌదరి, ఫైర్ ఆఫీసర్, కంభం

ఫైరింజన్ వచ్చేసరికే నష్టం జరిగిపోతోంది



ఏదైనా ప్రమాదం జరిగితే కంభం నుంచి ఫైరింజన్ వాహనం రావాలి. అది వచ్చే సరికే నష్టం వాటిల్లుతుంది. అందులోనూ అది పాత వాహనం కావడంతో మరీ ఆలస్యమవుతోంది. కొత్త వాహనం ఉంటే కొంత వరకు ఉపయోగకరంగా ఉంటుంది.

– పి.చలమారెడ్డి, రైతు, పాపినేనిపల్లి

కంభం:

వేసవి కాలం సమీపిస్తోంది.. అగ్ని ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండకపోతే ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోవడం ఖాయం. గిద్దలూరు నియోజకవర్గంలో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాలకు కలిపి కంభంలో అగ్నిమాపక కేంద్రం, అలాగే గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాలకు కలిపి గిద్దలూరులో అగ్నిమాపక కేంద్రం ఉన్నాయి. చుట్టుపక్కల మండలాల్లో ప్రమాదాలు సంభవిస్తే ఈ రెండు వాహనాలు వెళ్లి మంటలార్పుతుంటాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కంభం, గిద్దలూరు అగ్నిమాపక కేంద్రాల్లో నూతన బోర్లు వేయించారు.

రూ.కోట్లలో నష్టం

గడిచిన ఏడాది కాలంలో కంభం ఫైర్ స్టేషన్ పరిధిలో 50 అగ్నిప్రమాదాలు, గిద్దలూరు పరిధిలో 150 వరకు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గత ఏడాది జనవరిలో బేస్తవారిపేట వద్ద బొలెరో వాహనం, బైకు ఢీకొని మంటలు చెలరేగడంతో ముగ్గురు మృతి చెందారు. మరుసటి నెల ఫిబ్రవరిలో ఆటో–కారు ఢీకొని మంటలు చెలరేగి ముగ్గురు చనిపోయారు. కంభం నుంచి ఫైర్ వాహనం వెళ్లి మంటలు అదుపు చేసింది కానీ ప్రమాద తీవ్రతకు అప్పటికే ప్రాణ నష్టం సంభవించింది. గతేడాది గిద్దలూరు పరిధిలోని యడవల్లి వద్ద కారు దగ్ధమై ముగ్గురు చనిపోయారు. గత నెలలో అర్ధవీడు మండలంలో రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించి ఇళ్లు కాలిపోవడంతో బాధితులకు మూడు లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లింది. నియోజకవర్గంలో పలుమార్లు అరటి తోటలు, వరిగడ్డి వామిదొడ్లు, గృహాలు, దగ్ధమైన సంఘటనలున్నాయి. నాలుగురోజుల క్రితం అర్ధవీడు మండలంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో రూ.2 లక్షలకు పైగా నష్టం సంభవించింది.

కంభంలో 22 ఏళ్లుగా ఒకటే వాహనం

కంభం అగ్నిమాపక కేంద్రంలో 22 ఏళ్లుగా ఒకే వాహనాన్ని వినియోగిస్తుండటం గమనార్హం. సాధారణంగా 15 ఏళ్లు దాటితే వాహనాలను స్క్రాప్(తుక్కు) కింద పరిగణిస్తారు. లేదంటే వాహన కండిషన్‌ను బట్టి మూడు నుంచి ఐదేళ్లు సర్వీస్ రెన్యువల్ చేస్తారు. కానీ కంభం అగ్నిమాపక కేంద్రంలోని ఫైరింజన్ మాత్రం 22 ఏళ్ల నుంచి సేవలందిస్తూనే ఉంది. తరచూ మరమ్మతులకు గురవుతున్న ఈ వాహనాన్ని బాగు చేయించి మళ్లీ వినియోగిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల అర్ధవీడులో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం కాగా అక్కడ మంటలు ఆర్పి కంభం చేరుకున్న వెంటనే ఫైరింజన్ మొరాయించింది. దీంతో సిబ్బంది మరమ్మతులు చేయించి కార్యాలయంలో తెచ్చి పెట్టారు. ఇదిలా ఉండగా అర్ధవీడు లోయలోని యాచవరం, వెలగలపాయ, బొమ్మిలింగం, అచ్చంపేట గ్రామాలు, బేస్తవారిపేట మండలంలోని శింగరపల్లి, కోనపల్లి గ్రామాలు కంభం నుంచి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రమాదాలు సంభవించినపుడు కంభం నుంచి ఫైరింజన్ నెమ్మదిగా వెళ్లేసరికి అక్కడ ఆస్తి నష్టం జరిగిపోతోంది. తరచూ మరమ్మతులకు గురవుతున్న వాహనంతో మంటలు ఎలా అదుపు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గిద్దలూరులో వినియోగిస్తున్న వాహనం 11 ఏళ్ల క్రితం నాటిది కాగా ఇక్కడ ప్రమాదాల తీవ్రత అధికంగా ఉండటంతో అదనపు వాహనాన్ని మంజూరు చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.



కంభం కార్యాలయంలో ఉన్న 22 సంవత్సరాలనాటి ఫైర్ వాహనం

ఎస్‌హెచ్‌జీల ఆడిట్ సమర్థవంతంగా చేయాలి



మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్

మార్కాపురం టౌన్: గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ(స్వయం సహాయక సంఘాలు)ల ఆడిట్‌ను సీఆర్పీలు సమర్థవంతంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ వెలుగు మార్కాపురం ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల పరిధిలోని ఆడిట్ సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంఘంలోని బ్యాంకు లావాదేవీలు క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి వివరాలు సేకరించాలని కోరారు. ప్రతి సభ్యురాలు తీసుకున్న రుణాల చెల్లింపు వివరాలు పొదుపు ఖాతాలో జమ చేస్తున్న నగదు వివరాలను రికార్డు చేయాలన్నారు. ఏపీఎం పిచ్చయ్య మాట్లాడుతూ.. గ్రూపుల్లో ఏవైనా లోటుపాట్లు ఉంటే గుర్తించి వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, ఎల్‌సీ నాగభూషణం, సులోచన, సీసీలు నాగయ్య, మనోకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలల భవితకు బాసటగా ఫౌండేషన్ చదువులు



మాట్లాడుతున్న ఎంఈఓ



కొమరోలు: మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

కంభం: ఫౌండేషన్ చదువులు బాలల భవితకు బాసటగా నిలుస్తాయని ఎంఈఓలు మాల్యాద్రి, శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా 120 రోజులపాటు ప్రీ ప్రైమరీ విద్యను బోధించే అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధనా నైపుణ్యాన్ని మెరుగుపరిచి అభ్యసన ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ నీలోఫర్, ఆర్పీలు అంకిరెడ్డి, వేణుగోపాలచారి, రవికిశోర్‌రెడ్డి, సిఆర్పీలు మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచాలి

కొమరోలు: విద్యార్థుల్లో అభ్యసనా నైపుణ్యాన్ని పెంచేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు పేర్కొన్నా. మండల కేంద్రమైన కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమన్నా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి విద్యాశాఖాధికారులు హాజరై ఫౌండేషన్ చదువు ప్రాధాన్యతను వివరించారు. పిల్లలకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వెంకటరత్నం, హెచ్‌ఎం అశ్వనీకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుళాయి గుంత.. మహిళలకు చింత!



గుంతలో ఉన్న నీటి కుళాయి

పొదిలి: పట్టణంలోని ప్రకాశ్ నగర్‌లో పలు ప్రాంతాల్లో సాగర్ నీటి కుళాయిలు సుమారు నాలుగైదు అడుగుల గుంతల్లో ఉండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. గుంతల్లో నుంచి బిందెలతో నీటిని పైకి తీసుకురాలేక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్లు మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు వర్షాకాలంలో ఈ గుంతలు నీట మునుగుతుండటంతో మంచినీరు పట్టుకునేందుకు అవకాశం ఉండటం లేదు. చెత్తాచెదారం గుంతల్లోకి చేరి అపరిశుభ్రంగా తయారవుతున్నాయని, అధికారులు స్పందించి కుళాయిలు భూ ఉపరితలంపై ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు వేణుగోపాలుని రథోత్సవం



విద్యుత్ కాంతుల వెలుగుల్లో వేణుగోపాలస్వామి ఆలయం

తర్లుపాడు: తర్లుపాడులోని ప్రఖ్యాత రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్, ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఉభయ దేవేరులతో కలిపి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో పోలీసుల సాయంతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాగా తర్లుపాడు వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

శ్రీశైల భక్తులకు ఉచితంగా మందులు

మార్కాపురం టౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రానికి కాలినడకన వెళ్లే భక్తులకు స్థానిక ఏలూరి లక్ష్మీదేవి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. కాలినడకన వెళ్లే భక్తులకు నల్లమల అటవీ ప్రాంతంలో ఎంపిక చేసిన ప్రదేశాల్లో అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. జ్వరం, కాళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, అలర్జీ, గుండెనొప్పి, నీరసం, గ్యాస్ట్రిక్, జలుబు, దగ్గు, ఆస్తమా మందులతోపాటు యాంటీ బయోటిక్స్‌ను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. దాదాపు 10 రోజుల పాటు అభరాణ్యంలో నడిచి వెళ్లే భక్తులకు సరిపడినన్ని మందులను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. అలాగే భక్తులకు నీళ్లు, మజ్జిగ అందివ్వనున్నట్లు తెలిపారు. కాలినడకన వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేత



విద్యార్థులకు ప్యాడ్స్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తర్లుపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 400 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్స్ అందించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, డైరెక్టర్ కశ్శెట్టి వెంకట జగన్‌బాబు, ఆరికట్ల వెంకట నారాయణరెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు ప్యాడ్స్ బహూకరించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ–2 అచ్యుత సుబ్బారావు హాజరయ్యారు. తర్లుపాడు హెచ్‌ఎం ఎం.సుధాకర్, మీర్జపేట ఇన్‌చార్జి హెచ్‌ఎం స్వామి కుమార్, నాగెళ్లముడుపు హెచ్‌ఎం ఆదినారాయణ, తాడివారిపల్లి హెచ్‌ఎం అజీమ్‌బాషా, చెన్నారెడ్డిపల్లి హెచ్‌ఎం శ్రీనివాసరావు, తుమ్మలచెరువు హెచ్‌ఎం సుబ్రమణ్యం, కలుజువ్వలపాడు హెచ్‌ఎం సీహెచ్ సత్యనారాయణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ మారుతీదేవీ, పోతలపాడు హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని లయన్స్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు.

ప్రమాదకరంగా సర్వీస్ రోడ్డు చప్టాలు



తహసీల్దార్ కార్యాలయ రోడ్డు ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న చప్టా

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ ఆవరణలో అనంతపురం–అమరావతి జాతీయ రహదారి సర్వీసు రోడ్డు ప్రమాదకరంగా మారింది. హైవేతో సర్వీస్ రోడ్డు అనుసంధానమయ్యే ప్రదేశంలో డ్రైనేజీపై నిర్మించిన చప్టాలు సక్రమంగా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనాల రాకపోకల సమయంలో నేరుగా హైవేపైకి వెళ్తుండటం, రోడ్డు దాటేందుకు వాహనదారులు ప్రయత్నించే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో ఒకరు మృత్యువాత పడ్డారు. తహసీల్దార్ కార్యాలయ రోడ్డుకు ఎదురుగా ఏర్పాటు చేసిన చప్టాకు ఇరువైపులా కంకర తొలగిపోయి లోతైన గుంతలు పడ్డాయి. ఎత్తు ఎక్కువగా ఉండటంతో లారీలు, మినిబస్‌లు, ట్రాక్టర్లు, ఆటోలు రాకపోకలు సాగించే పరిస్థితి లేకుండాపోయింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రికెట్ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఇటీవల నిర్వహించిన ఎస్ఎస్ఎన్ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాల జట్టును మాజీ మంత్రి సురేష్ మంగళవారం అభినందించారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రికెట్ జట్టుకు 5 వేల రూపాయల నగదు బహుమతి అందించారు. కెప్టెన్ సుబ్బు, టీమ్ సభ్యులతోపాటు ఫిజికల్ డైరెక్టర్లు జయరావు, విక్రమ్, కోచ్ పోలయ్యలను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ టాలెంట్ టెస్టు

కొమరోలు: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం కొమరోలులో ఛత్రపతి శివాజీ టాలెంట్ టెస్టు 2025 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు కొమరోలు పబ్లిక్‌స్కూల్లో టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 7, 8, 9 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

కంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



బేస్తవారిపేట : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మెర్సీ

బేస్తవారిపేట: కంది పంట సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ సూచించారు. మంగళవారం కలగొట్ల, పాత మల్లాపురంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్క్‌ఫెడ్ తరఫున కంది కొనుగోలు కేంద్రం ప్రారంభించామని, మద్దతు ధర క్వింటాకు రూ.7,550 ఇస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో యూనిక్ ఐడీ ఉన్న రైతులకే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఏపీ ఎఫ్‌ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ ఆదిగణేష్, వీఏఏలు రమణారెడ్డి, బాలీశ్వర్ పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి

కొనకనమిట్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఫార్మర్ రిజిస్ట్రీ' కార్యక్రమం ద్వారా రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నట్లు ఏఓ ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. మంగళవారం తువ్వపాడు, రేగుమానిపల్లి గ్రామాలలో రైతులకు నిర్వహించిన సమావేశంలో ఆమె వ్యవసాయానికి సంబంధించి పలు సూచనలిచ్చారు. రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐడీ నంబర్ కేటాయిస్తారని తెలిపారు. దీని ద్వారానే ఇకపై రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులు, పీఎం కిసాన్, పంటల బీమా లాంటి పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రవికాంత్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు కావాలని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నాయుడుపల్లి, పెద్ద యాచవరం గ్రామాల్లో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి రైతుకు ఒక గుర్తింపు సంఖ్య ఇస్తున్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి యూనిక్ ఐడీ పొందవచ్చని చెప్పారు. అనంతరం మిర్చి పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పావనేశ్వరి, జయంతి పాల్గొన్నారు.